

# ఒక మొగ్గ రాలింది

— ఎలక్ట్రాన్

ప్రతి రోజు అందంగా ఉండే సాయంత్రం మబ్బుపట్టడంతో ముందే కటిక పూసుకుంది. ఎడతెగకుండా కురుస్తున్న వానజల్లు వల్లా, ఉండుండి వీస్తున్న వెర్రి గాలి వల్లా వెన్ను జలదరిస్తోంది. ఆకలితో అలమటించి క్షీణం పొందిన వాడి నోట్లో పాయసం పోసినట్లుగా, ఎండలతో భూములన్నీ బీటలు వారి పంటలు నాశనమైన తరవాత కురుస్తున్న వానకి రైతు ప్రజల మనసు విలవిల లాడుతూంటే, ఆ చలి చలి వాతావరణంలో ఇంటికి పోయి పెళ్ళాన్ని పక్కలోకి లాక్కుని ముసుగు వేసుకుని వెచ్చగా పడుకోకుండా, పరీక్షలు దగ్గర కొచ్చేసినా పాఠాలు పూర్తి కానందువల్ల, కుర్రాళ్ళకి సమయం దాటి బోధన చెయ్యవలసి వచ్చినందుకు కుమారస్వామి మనసు కుతకుత లాడిపోతూంది.

"సార్! గదంతా చీకటిగా ఉంది. చీకట్లో మేం ఏం రాసుకునేది?" ఒక కుర్రాడు కొంచెం ఓట పటాయిస్తూ అడిగాడు.

"స్కూల్లో దీపాలు లేనప్పుడు, సమయం దాటి పాఠాలు చెప్పమంటే ఇలాగే ఉంటుంది మరి! ఆ మాటా ఎవరూ కూర్చుంట? శ్రీహరీ! నువ్వు పోయి హెడ్మాస్టరుగారితో చెప్పరా!" అన్నాడు విసుగ్గా.

శ్రీహరి నెమ్మదిగా లేచి వరండాలోకి వెళ్ళి హెడ్మాస్టరు గది వైపు దారి తీశాడు. హెడ్మాస్టరు బయట వరండాలో నిలుచుని, వాన చినుకుల్లో తడుస్తున్న గులాబీ మొక్కల వైపు చూస్తున్నాడు. శ్రీహరి ఆయన దగ్గరగా వెళ్ళి, "సార్! గదిలో వెలుతురుగా లేదు. పాఠాలు చెప్పడం కష్టమని కుమారస్వామిగారు చెప్పమన్నారు" అన్నాడు

"సరే. ఈ రోజుకి ఆపు చేయమను. రేపు ఉదయం ఎనిమిదింటి కల్లా అందరూ రండి. ఆదివారం కదా అని అశ్రద్ధ చెయ్యకండి. మాస్టార్ని ఒక సారిలా రమ్మనమని చెప్పు" అని హెడ్మాస్టరు మళ్ళీ మొక్కల వైపు దృష్టి సారించాడు.

శ్రీహరి తీసుకొచ్చిన వార్త విని ఆ రోజుకి పీడా విరగడైనందుకు ఆనందంగాను మరునాడుదయం మళ్ళీ తప్పనందుకు తిట్టుకుంటూను కుర్రాళ్ళు, కుమారస్వామికూడా బయట పడ్డారు.

శ్రీహరీ, కుమారస్వామీ హెడ్మాస్టరున్న వైపు వెళ్ళారు. కుమారస్వామిని చూసి—"రేపు రమ్మని చెప్పాను. శ్రమ తప్పదు మరి. మీరో గంట సైన్సు తీసుకున్న తరవాత నేనో గంట ఇంగ్లీషు తీసుకుంటాను. నేను క్లాసు తీసుకుంటున్నానని తెలిస్తే కుర్రాళ్ళెవరూ రారు! అందుకని మిమ్మల్నికూడా ఇరికించ వలసి వస్తుంది!" అన్నాడు హెడ్మాస్టరు.

మాట మంచితో ముందర కాళ్ళకి బంధం వేసి మాట్లాడే హెడ్మాస్టరి లౌక్యం కుమారస్వామికి తెలియంది కాదు. "అలాగే నండి" అని చప్పగా నవ్వుకుంటూ స్టాఫ్‌రూంలోకి దారి తీశాడు.

గుడ్డి వెలుతుర్లో నోటీసుబోర్డుని చూడ్డానికి ప్రయత్నిస్తున్న శ్రీహరి—హెడ్మాస్టరు మాటలు విని నవ్వు ఆపుకోలేకపోయాడు. హెడ్మాస్టరు శ్రీహరి దగ్గరగా వెళ్ళి "రేపు—క్లాసులకి కుర్రాళ్ళెవరూ రాకపోతే, నీ చెవి మెలి పెడ్తాను. నేను క్లాసు తీసుకుంటున్నట్టు ఎవరికీ చెప్పకు!" అన్నాడు.

"ఎవరికీ తెలియకపోతే, ఇంగ్లీషు పుస్తకాల తెచ్చుకోరుసార్!" అన్నాడు శ్రీహరి, నవ్వుని ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ. హెడ్మాస్టరుకూడా నవ్వకుండా ఉండలేక పోయాడు. "సరేలే, నీ తెలివికి సంతోషించాలే! పాఠం గురుంచి ఎస్సేలు నేను డిక్టేట్ చేస్తాను. రాసుకుందురు కాని. టెక్స్టుపుస్తకాలు అవసరం లేదు" అన్నాడు.

శ్రీహరి తల ఆడించి స్టాఫ్‌రూమ్ వైపు వెళ్ళబోయాడు. హెడ్మాస్టరు ఉన్నట్టుండి శ్రీహరిని ఆపి, "అన్నట్టు నోటీసు బోర్డు చూస్తున్నావు! గుడ్డి వెలుతుర్లో ఏం కనబడుతుందని? ఉదయం పూట చూడలేదా? ఫైన్‌తో కట్టేనాకూడా పరీక్ష ఫీజుకి ఆఖరి రోజు ఎల్లుండి. ఇంతకీ నువ్వు ఫీజు కట్టినట్టు లేదు కదూ?" అని ప్రశ్నించాడు.

నాలుగు రూపాయలు చేసే కాడ్‌బరీస్ చాక్లెట్ తింటూ, టాఫీలు కొనుక్కోడానికి నీ దగ్గర డబ్బు లున్నాయా అని పెదరాజుగా రబ్బాయి అడిగినప్పుడు కూడా శ్రీహరి అంతగా బాధ పడలేదు కాని, హెడ్మాస్టరన్న మాటలు, దివి సీమను దిబ్బ చేసిన ఉప్పెనలా శ్రీహరిని తాకడంతో దుఃఖం గంగలా పొంగింది. మొహంమీద పడుతూన్న వానజల్లుతోపాటు, కళ్ళమ్మట గోదావరి ప్రవహించింది. శ్రీహరి మంచి సమాధానం రాకపోవడం చూసి హెడ్మాస్టరు "ఏ అప్పో సప్పో చేసి డబ్బు కట్టాలి కాని, చూస్తూ కూర్చుంటే ఎలా? మీ అన్నయ్యతో చెప్పు" అంటూ గదిలోకి పోయాడు.

స్టాఫ్ రూమ్‌లోంచి గొడుగు తీసుకుని బయటకు వస్తున్న కుమారస్వామి హెడ్మాస్టరన్న మాటలు విన్నాడు. శ్రీహరి దగ్గరగా వచ్చి, భుజం మీద చెయ్యి వేసి "పద పద" అన్నాడు. వరండా మెట్లు దిగబోయే ముందు గొడుగు విప్పి, మళ్ళీ శ్రీహరి భుజం మీద చెయ్యి వేసి నెమ్మదిగా అడిగాడు: "పరీక్ష ఫీజు కట్టలే దెందుకని?"

"అన్నయ్యని చాలా సార్లు అడిగాను. ఇదుగో, అదుగో అంటూ ఇంత కాలం జరిగిపోయింది. ఇవ్వాళ ఉదయంకూడా జ్ఞాపకం చేశాను. అలాగే చూద్దాంలే, ఎల్లుండి వరకూ టైం ఉంది కదా అన్నాడు." శ్రీహరి మాటల్లోని గాద్గదికం కుమారస్వామిని కదిలించింది. చక్రం బురద గుంటలో

పడి నిస్సహాయంగా నిలుచున్న బండివాణ్ణి చూసి దారిన పోయే జనంలో నవ్వే వాళ్ళూ, అయ్యో పాపం అని జాలి చూపించి పెదవి విరిచే వాళ్ళే చాలా మంది. కుమారస్వామి మాస్టారుకి ఆ సమయంలో శ్రీహరికెందుకో సహాయం చెయ్యాలనిపించింది. "ఫీజు కట్టలేకపోతే ఏడాది చదువూ వృథా అయిపోతుంది. సరే, నాతో ఇంటికి రా. ఆ డబ్బు నేను సర్దుతాను. తరవాత తిరిగి ఇవ్వవచ్చు" అన్నాడు. శ్రీహరి మాటలతో కృతజ్ఞత తెలుపుకోలేదు. భుజం మీద వేసిన చెయ్యిని తీసి కళ్ళ కద్దుకున్నాడు.

శ్రీహరి మనసు ఆనందంగా ఉంది. మాస్టారిచ్చిన డబ్బు లాగు జేబులో పెట్టుకుని ఇల్లు చేరాడు. అరుగు మీద కుర్చీలో కూర్చుని దుప్పటి కప్పుకుని సిగరెట్ కాలుస్తున్న రామకోటి, తమ్ముడు శ్రీహరి రాకని గమనించలేదు. లోపలికి వెళ్ళి డబ్బు తీసి లెక్కల పుస్తకంలో దాచి, తడితడిగా ఉన్న బట్టల్ని మార్చి పొడి బట్టలు కట్టుకున్నాడు శ్రీహరి.

వదులుతున్న పొగల తివాచి మీద గగనవీధుల్లో విహరిస్తున్న రామకోటి కిందికి పడడం, పాతాళ సముద్రంలో మునిగిన శ్రీహరి పైకి తేలడం వంటింట్లోంచి వచ్చిన భోజనం పిలుపు వల్ల ఒకేసారి జరిగింది. ఉన్న నెయ్యిని కాస్త ఇద్దరి పిల్లలకీ, మొగుడికీ వేసి ఉత్త గరిటని తన విస్తట్లోకి విదిల్చినందుకు, వదినను చూసి చిన్నగా నవ్వుకున్నాడు శ్రీహరి. నీళ్ళ చారు అన్నంతో కలుపుతూ "అన్నయ్యా! నా పరీక్ష ఫీజు. . ." అని ఇంకా ఏదో అనబోతున్న శ్రీహరి మీద ఒక్కసారి విరుచుకు పడింది రామకోటి భార్య.

"నీ కింక వేరే సమయం దొరకలేదా? ఈ కాస్త తిండీకూడా సహించకుండా, నీ అవసరాల్ని గురించి ఇప్పుడే అఘోరించాలా ఏమిటి? ఇప్పటి కిది ఎన్నో సారి అడగడం?"

శ్రీహరికి మనస్సు చివుక్కుమంది. వికసించిన మల్లెల్ని వాసనలు వెదజల్లనీయకుండా మురికి కాలవలో పడవేసినట్లయింది. మరిమాట్లాడ బుద్ధి వేయక మౌనంగా ఉండిపోయాడు.

"వాడిమీ దెందుకు నోరు చేసుకుంటావు? పరీక్ష ఫీజు కోసం అడిగాడంతే కదా! హరీ! ఎల్లుండి కదా కావాలిసింది? అప్పటికి ఏర్పాటు చేస్తాగా" అన్నాడు రామకోటి డాంబికంగా.

"అయిన వాడు కాబట్టి అలా వెనకేసు కొస్తున్నారు. పక్కింటావిడ దగ్గర పుచ్చుకున్న చేబదులిప్పటికీ తీర్చలేదు! పది సార్లడిగింది. మరి దాని సంగతి? చిన్నాడికి లాగులు చిరిగి పోయాయి. మరి వాటి సంగతి?" విసురుగా, విసుగ్గా అడిగింది.

ఆ కోపం అన్న మీద కాదని శ్రీహరికి తెలుసు. వదిన అన్నకి ఆలి కాగలిగింది కాని, తనకి తల్లి కాలేదని శ్రీహరి ఏ నాడో గ్రహించాడు. అయినా అన్న గార్పులా అంటోంటే వూరుకోలేక అన్నాడు: "అది కాదు, వదినా, పరీక్ష ఫీజు కుమారస్వామి మాస్టారు డబ్బిస్తానని అన్నయ్యతో చెబుదా మనుకుంటోంటే నువ్వు పూర్తిగా వినకుండా. . ."

"అషోత్తరం మొదలెట్టావేంటావు? ఆయన పుట్టకు పూరికే ఇచ్చాడంటావా? ఎలాగూ మీ అన్నయ్య తీర్చ వలిసిందే కదా?" రామకోటి భార్య అసహనంగా అంది.

నేల కరిచి లేవబోతున్న వస్తాదుని, నరాతి మీద తన్ని మళ్ళీ పడగొట్టినట్లనిపించింది శ్రీహరికి. అన్నంమీద ఒక్కసారిగా రోత పుట్టింది. విస్తరి ముందు నుంచి లేచిపోయి మరింత రాద్ధాంతం కలగ చెయ్యడం ఇష్టం లేక పెట్టిన తిండిని నోట్లో కుక్కుకుని లేచాడు శ్రీహరి.

అరుగు మీద కూర్చుని ఆకాశంలో కనబడని నక్షత్రాల కోసం వెదుకుతున్న శ్రీహరి రామకోటి మాటలతో ఈ లోకంలో పడ్డాడు. "వదిన మాటలు పట్టించుకోకు. పక్కింటావిడకి పదిహేను ఇవ్వాలట. ఆవిడ అడిగిందని అవమానపడి అలా చేస్తుంది!"

మంచుగడ్డ లాంటి తన మనస్సుని కాఫీ వేడితో కరిగించడానికి అన్న ప్రయత్నిస్తున్నాడని శ్రీహరికి అనిపించింది. సమాధానం ఇవ్వకుండా కూర్చున్నాడు.

"చూడు—ఆయన ఇచ్చిన డబ్బు ఇలా ఇవ్వు. పక్కింటావిడ బాకీ తీర్చేయమని వదిన కిస్తాను. లేకపోతే నన్నీ రాత్రికి నిద్ర పోనివ్వదు. రేపు మధ్యాహ్నానికల్లా రామవరం నుంచి ఒక పార్టీ డబ్బు అందజేస్తుంది. వాళ్ళకి ఆఫీసులో నేను సహాయం చేసి పెట్టాను. దాంతో నీ పరీక్ష ఫీజు కట్టడమే కాకుండా మాస్టారికి డబ్బుకూడా తిరిగి ఇచ్చేయవచ్చు!" రామకోటి నెమ్మదిగా నసుగుతూ శ్రీహరిని బుజ్జగిస్తూ అన్నాడు.

కావు రానిచెట్ల నుంచి, ఎదగని చెట్లనుంచి ఫలాల్ని ఆశించే మూర్ఖుడిలా కనబడ్డాడు రామకోటి—శ్రీహరికి. ఒక రకమైన నిర్లిప్తత మనసులో చోటు చేసుకుంటూండగా, లేచి లోపలికి వెళ్ళి లెక్కల పుస్తకంలో దాచిన డబ్బు తీసి అన్న చేతి కిచ్చాడు.

ఆ రాత్రి శ్రీహరి మనసులో ముసురు పట్టింది. కలవరింతల కలత నిద్రే శరణ్యమైంది. మరునాడు కూడా బారెడు పొద్దెక్కినా, సూర్యుడి కిరణం భూమిమీద పడలేదు.

మధ్యాహ్నం భోజనాలైన తరవాత రామకోటి భార్య అంత వానలోనూ పక్కింటావిడతో కలిసి బయటికి పోయింది, సినిమాలా బకీ తీర్చడం కోసం. పెళ్ళాం సినిమాకి వెళ్ళగా చూసి, రామకోటి రామవరం పార్టీ ఆఫీసు దగ్గర కొస్తుందని చెప్పి క్లబ్బుకి పోయాడు. పెళ్ళాని కివ్వగా మిగిలిన డబ్బుని రెండింతలు చేద్దామని కలలు కంటూ పేకాడి, ఉన్నదంతా పూడ్చి పెట్టి, మరో అంత అప్పు పడి ఇల్లు చేరాడు రామకోటి.

జోగిలా ఇంటి కొచ్చిన అన్ననీ, హుషారుగా తిరిగొచ్చిన వదినని చూసి శ్రీహరి ఈ సారటు జాలి పడ్డాడు.

"కాఫీ త్వరగా కలుపు. తల నొప్పిగా ఉంది" అంటున్నాడు రామకోటి వంటగది గుమ్మం మీద కూర్చుంటూ.

"అదే ప్రయత్నంలో ఉన్నాను. వెధవ బొగ్గులన్నీ తడిసి పోయాయి. పాత కాగితాలేవైనా ఇవ్వండి అంటించడానికి" అంటూంది రామకోటి భార్య.

శ్రీహరి తన లెక్కల పుస్తకం వంటింట్లోకి తీసుకు వెళ్ళి, వాళ్ళ ఎదురుగా నాలుగైదు పేజీలు చింపి, వదిన చేతిలో ఉంచాడు హాయిగా, నిండుగా నవ్వుతూ.

ఒక పసి హృదయం బండ బారింది. వికసించబోయే ఒక కుసుమం మొగ్గగానే రాలింది *

